
ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబరు, 2025 9 పేజీలు
శ్రీకాకుళం



ఎస్‌టి కమిషన్ సభ్యుల విచారణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని బందపల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలికలపై దొంగతనం ఆరోపణలు మోపి దాడి చేసిన ఘటనపై ఎస్‌టి కమిషన్ సభ్యులు కె.నాగ మల్లేశ్వరరావు శనివారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న పీడీ ఎస్.కళ్యాణి, ఆమె భర్త రామచంద్రరావు బాలికలను కొట్టినట్లు వచ్చిన ఆరోపణలపై విద్యార్థులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో (మిగతా...2)



మాట్లాడుతూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

జిల్లా అభివృద్ధిపై దృష్టి

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- సకాలంలో నిధుల వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సకాలంలో వినియోగించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో శనివారం పాల్గొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పథకాల అమలు పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 2,27,142 మంది రైతులకు రూ.2,771.9 కోట్ల పంట రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో 5,608 పనులు మంజూరయ్యాయని అన్నారు. ఇప్పటివరకు 5,35,764 గృహాల్లో 2,30,381 గృహాలకు నల్లాల ద్వారా తాగునీరు అందించినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం కింద ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షల వరకు చికిత్స సదుపాయం ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 41 పిఎంశ్రీ పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌కుమార్, జడ్‌పి సిఇఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉపాధి' రక్షణకు ఉద్యమం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎస్.కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కె.మోహన్ రావు అధ్యక్షతన శనివారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది మంది పేదలకు తోడుగా ఉన్న ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం రాం రాం పలికిందన్నారు. దాని స్థానంలో జీ రాం జీ పేరుతో కొత్త చట్టం చేసిందన్నారు. పేరు మార్పు మాత్రమే కాదు గతంలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేదని, ఇప్పుడు 60 శాతం నిధులు, కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని, మొత్తం ఖర్చు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

అయిన తరువాత కేంద్రం 60 శాతం నిధులు ఇస్తుందని చెప్తుందని అన్నారు. ఇది రాష్ట్రాలపై తీవ్రమైన ఆర్థిక భారం వేసి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికేనని అన్నారు. టిడిపి, జనసేన పార్టీల మద్దతు లేకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఒక్కరోజు దేశాన్ని పాలించలేదని చెప్పారు. కీలక మద్దతు దారులుగా ఉన్న ఈ రెండు పార్టీలు ఈ వినాశకర బిల్లును ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. గత 11 ఏళ్లుగా బిజెపి తమ మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ ఎజెండాను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అందుకే పేరు మార్చి తద్వారా కార్పొరేట్లకు నమ్మకంగా సేవ చేస్తుందని అన్నారు. కార్పొరేట్ (మిగతా...2)


2026 డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజాశక్తి-2026 నూతన డైరీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డైరీతో పాటు ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు, స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, పి.వాసు తదితరులు పాల్గొన్నారు.



31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1న పంపిణీ చేయాల్సిన పింఛన్లు నూతన సంవత్సరం దృష్ట్యా అవ్వాతాతలకు ఈ నెల 31న పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో పింఛనుదారులు గమనించాలని తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి


రణస్థలం : సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

రణస్థలం : ఈ నెల 31 నుంచి వచ్చే 4 వరకు నిర్వహించన్ను సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కోష్టలో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు. జనవరి 4న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ ఉంటుందని పేర్కొన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెలవు లేకుండా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని, వారానికి ఒక సెలవు ప్రకటించాలని అన్నారు. పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 5జి సపోర్ట్‌తో పని చేసే ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ప్రతినెలా 1న చెల్లించాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.లీలావతి, నాయుకులు పి.రాజు, సుభద్ర, పైడి.లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరులో సిఐటి యు అఖిల భారత మహాసభల విజయవం తంపై నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, పల్లి కృష్ణ, మొగిలి రాములు, తిరు చెందూర్ రాంబాబు, మడపాన రామినాయు డు, తెల్లన్న, బాలరాజు, అప్పన్న పాల్గొన్నారు.

మందస: ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు డాక్టర్ కె.ఖగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రచార పోస్టర్లను అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండలం నాయకులు పి.దేవేంద్ర, ఆర్.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పెళ్లయిన ఐదు నెలలకే... వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- సోంపేట


ఊర్మిళ (ఫైల్)

మండలంలోని జింకిభద్రకు చెందిన తామాడ ఊర్మిళ (24) వివాహిత శనివారం ఫ్యాన్‌కి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... జింకిభద్రకు చెందిన తామాడ సాయితో మామిడిపల్లికి చెందిన ఊర్మిళకు ఐదు నెలల క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భిణి. ఇటీవల భార్యాభర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లి వచ్చారు. శుక్రవారం భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంటిపై ఉన్న హాల్‌లో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎప్పటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూశారు. ఫ్యాన్ వేలాడుతున్న ఆమెను గ్రామస్తుల సహకారంతో కింద దించి (మిగతా...2)

సాంస్కృతికం వీనుల విందు

- అలరించిన పుస్తక మహోత్సవం
- ఆకట్టుకున్న నాటిక పోటీలు

ప్రజాశక్తి- అరసవల్లి




2025లో సాంస్కృతిక కార్యక్రమాలు వీనుల విందు చేశాయి. జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలు, రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం, నీరజ సుబ్రహ్మణ్యం శిష్య బృందం నృత్య ప్రధర్శనల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అదేవిధంగా ఫిబ్రవరి 4న నిర్వహించిన అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలు ప్రభుత్వం రాష్ట్ర పండగ నిర్ణయించి మూడు రోజులు నిర్వహించారు. ఎప్పుడూలేనివిధంగా జిల్లా నలుమూలల నుంచి యాత్రికులు తరలివచ్చి దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వాహనాలపైన నృత్య ప్రదర్శనలు, పర్యాటక ప్రదర్శనలు, సిక్కోలు చరిత్రలను, కూచిపూడి నృత్య బంగివులను వాహనాలపై రూపకాలుగా ప్రదర్శనలతో ఆలయం వరకు అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసు కువెళ్లి రథసప్తమి ఉత్సవాలను నిర్వహిం చారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. అంగరంగ వైభంగా సంస్థల కార్యక్రమాలు నిర్వహించారు. ఆగస్టులో శ్రీకాకుళం రంగస్థల కళాకారులు సమాఖ్య ఆధ్వర్యాన పౌరాణిక జానపద ఏకపాత్రాభినయాలు ఘనంగా నిర్వహించారు. జులైలో (మిగతా...2)

రౌండప్ 2025

ఎస్‌పికి దువ్వాడ ఫిర్యాదు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



ఫిర్యాదు చేస్తున్న దువ్వాడ

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శనివారం రాత్రి కలిశారు. తాజాగా తనపై దాడి చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఈ క్రమంలో బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. గతంలో కూడా తనపై దాడి చేస్తామని బెదిరిస్తూ ఫోన్స్ కాల్స్ వచ్చాయని అన్నారు. అప్పుడూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.



అభినందిస్తున్న మత్స్యకార నాయకులు

ధర్మార్జునరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండల మాజీ ఎంపిపి చిదపాన ధర్మార్జునరెడ్డిని టిడిపి పార్లమెంట్ సెక్రటరీగా అధిషానం నియమించింది. దీంతో మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరువాడ సర్పంచ్ ప్రతినిధి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు, ఎఎంసి డైరెక్టర్ సూరాడ ధనరాజు, జిల్లా మత్స్యకార డైరెక్టర్ గంట లోకేష్, సూరాడ కృష్ణ శనివారం ఆయననను కలిసి సన్మానించారు.



నాసిరకంగా చేపడుతున్న రహదారి మరమ్మతు పనులు

నాసిరకంగా రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎస్‌పి ప్రధాన రహదారి నుంచి మండలంలోని కొర్లకోట వరకు చేపడుతున్న రహదారి మరమ్మతు పనులు నాసిరకంగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని పలువురు ప్రజలు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొడ్డేపల్లిపేట జంక్షన్ నుంచి కొర్లకోట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిపై ఏర్పడిన గుంతల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.6 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేసింది. అయితే రహదారిపై ఏర్పడిన పగుళ్లను పూర్తిగా తొలగించకుండా తూతూ మంత్రంగా వాటిపై బేబీ చిప్స్ వేసి తారుపోసి పనులు చేపడుతున్నారని పలువురు గుత్తేదారు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం గోతుల్లో 20 ఎంఎం చిప్స్ వేసి తారుతో రోలింగ్ చేసి సక్రమంగా మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బి అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా నాసిరకంగా చేపడుతున్న పనులతో రహదారులు ఎంతకాలం నిలుస్తాయో లేక త్వరితగతిన పాడవుతాయో వేచి చూడాల్సిందేనని పలువురు చర్చించు కుంటున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బి ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, నిబంధనలకు అనుగుణంగా నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



రథసప్తమికి పక్కా ఏర్పాట్లు

- సాంస్కృతిక, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు
- వారం రోజుల పాటు ఉత్సవాలు
- ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- అరవసల్లి

అరసవల్లి క్షేత్రంలో జనవరిలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రథసప్తమి ఏర్పాట్లపై శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది వేడుకలను ఏడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, పార్కింగ్ సౌకర్యాలను క్షేత్రానికి మరింత చేరువలోకి తీసుకొస్తామని తెలిపారు. రికార్డు స్థాయిలో 200 పబ్లిక్ మరుగుదొడ్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా టెంట్లు, బెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అందరికీ స్వామివారి ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు, పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. నగరమంతా విద్యుత్ కాంతులతో వెలిగిపోవాలని, ప్రభుత్వ భవనాలతో పాటు ప్రజలు తమ ఇళ్లను కూడా అలంకరించుకోవాలని కోరారు. ఈసారి రథసప్తమి వేడుకల్లో ఏడు రోజుల పాటు హెలికాప్టర్ పర్యటనలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శోభారాణి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, విశ్రాంత డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ ఇఒ ప్రసాదరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, స్వచ్ఛంద సంస్థల సంస్థల ప్రతినిధి ఎ.రమణమూర్తి, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ సిందూరు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

డ్రగ్స్ వద్దు బ్రో

- జంట పట్టణాల్లో విద్యార్థులతో ర్యాలీ
- సైకిల్‌యాత్రను ప్రారంభించిన శిరీష



సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ చేయడానికి ప్రజలంతా చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరుతూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ నిర్వహిస్తున్న అభ్యుదయ పాదయాత్ర శనివారం పలాస-కాశీబుగ్గకు చేరుక ఉంది. ఈ సందర్భంగా పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులంతా రోడ్డుపైకి వచ్చి సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు. భారీయాత్ర సాగిస్తూ... రెండు కిలోమీటర్ల పొడవునా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలాస రైల్వే క్రీడామైదానంలో బహిరంగ సభ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ఇందిరాచౌక్ వద్ద సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే తొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాశీబుగ్గ డిఎస్‌పి షేక్ షహబాక్ అహ్మద్ మాట్లాడుతూ తాను పాడేరులో పనిచేస్తున్నప్పుడు గంజాయిని పూర్తిగా అరికట్టామని తెలిపారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన జెడ్‌పి స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఒగ్గుకథ ఎంతో ఆకట్టుకుంది. బొడ్డపాడుకు చెందిన కిక్కర ఢిల్లీరావు బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తప్పెడగుళ్లు, తీన్మార్ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కాశీబుగ్గ సిఐ వై.రామకృష్ణ ఆధ్వర్యాన చేపట్టారు. ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు జీడిపప్పు ప్యాకెట్లు అందించి ప్రోత్సహించారు. సమావేశంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపిడిఒలు ఎన్.రమేష్ నాయుడు, కె.వసంత్‌కుమార్, ఎంఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉపాధి' రక్షణకు ఉద్యమం

కంపెనీల ప్రయోజనాల కోసం గతంలో వ్యవసాయ చట్టాలు తెచ్చి భంగపడ్డ బిజెపి ప్రభుత్వం, ఇప్పుడు లేబర్ కోడ్స్ తెచ్చిందని అన్నారు. ఉపాధి చట్ట సవరణ చేస్తుందని పేర్కొన్నారు. అటవీ చట్టాలను మార్చివేసిందని తెలిపారు. చట్టం స్ఫూర్తిని దెబ్బతీసి గ్రామీణ కూలీల ఆర్థిక, సాంఘిక జీవితంలో కొన్ని మార్పులు తీసుకురావడానికి ఈ చట్టం ఎంతగానో తోడ్పడిందని చెప్పారు. గత 18 ఏళ్లుగా గ్రామీణ వలసలను తగ్గించిందని అన్నారు. సన్న, చిన్న కారు రైతుల భూములు అభివృద్ధి చెందాయన్నారు. రైతుల వ్యవసాయ అభివృద్ధికి ముఖ్యంగా కరువు ప్రాంతాల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రధాన కారణమైంది చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువ, పంచాయతీ, అంగాన్వాడీ భవనాలు వంటి మౌలిక సౌకర్యాలు కొంత మేరకైనా మెరుగు పడటానికి ఈ చట్టం నిధులు తోడ్పడ్డాయన్నారు. అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవరి కృష్ణమూర్తి, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పాలాకి ప్రసాదరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లండ వెంకటరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ సంక్షేమ సంఘం నాయకులు గోవర్ధనరావు, ఎఐవైఎఫ్ నాయకులు బొత్స సంతు తదితరులు పా ల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ సభ్యుల విచారణ

సేకరించిన అంశాలను ఎస్‌టి కమిషనర్‌కు సమర్పిస్తామని కమిషన్ సభ్యులు తెలిపారు. అనంతరం బందపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మెళియాపుట్టి మండలం అధ్యక్షులు సవర గణేష్, కార్యదర్శి సవర వెంకటేష్‌లు ఎస్‌టి కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. బాలికలపై దాడికి బాధ్యులైన పీడీ కళ్యాణి, ఆమె భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మొదటి పేజీ తరువాయి

ఇన్‌ఛార్జి వార్డెన్ సస్పెన్షన్

ఇదిలా ఉండగా ఈ ఘటనపై స్పందించిన పార్వతీ పురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ప్రాజక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఇన్‌ఛార్జి వార్డెన్ ఎస్.కళ్యాణిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

పెళ్లయిన ఐదు నెలలకే...

చూడగా... అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి గేదెల జ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త సోంపేటలో సెల్ రిపేరు షాపు నిర్వహిస్తూ... జీవనం సాగిస్తున్నాడు. భార్య ఆత్మహత్య చేసుకుందని సమాచారం తెలిసిన వెంటనే సోంపేటలోనే సాయి స్పృహ కోల్పోయాడు. వెంటనే సాయిని పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పెళ్లయిన ఐదు నెలలకే ఆత్మహత్యకు పాల్పడడంతో ఆమె తల్లిదండ్రులు, అత్తవారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


సాంస్కృతికం వీనుల విందు

శ్రీసుమిత్ర కళా సమితి ఆధ్వర్యాన హరికథ నవరత్నాలు పేరిట బాపూజి కళామందిర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జులైలో సినారే గానలహరి కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబరులో బాలసుబ్రమణ్యం సుమధుర గీతాలాపన నిర్వహించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన బృందావన్ హోటల్‌లో బుద్ధినితో నా ప్రయాణం (అంబేద్కర్‌పై) ప్రత్యేక నాటకం రూపంలో ప్రదర్శన ఎంతగానో ఆకటుకుంది. నంబరు 11 నుంచి 20 వరకు నగరంలోని తొలిసారిగా వందకు పైగా ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలతో వేలాది పుస్తకాల ప్రదర్శన, అమ్మకం సిక్కోలు పుస్తక మహోత్సవం పేరిట సిక్కోలు పుస్తక కమిటీ ఆధ్వర్యాన ఏడు రోడ్డు కూడలి సమీపం ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించారు. అనేక మంది పుస్తక ప్రియులకు, సాహితీ వేత్తలను పండగ వాతావరణం కలిగించింది. ఈ పుస్తక మహోత్సవంలో పుస్తకాల ప్రదర్శనతో పాటు, కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు కవులు వేషధారణలు, మూఢనమ్మకాలపై స్కిట్స్, నృత్య ప్రదర్శనలు, తప్పెటగుళ్ల ప్రదర్శన, డప్పు విన్యాసాలు, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢనమ్మకాల ప్రదర్శనలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించాయి. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యాన ప్రతినెలా నిర్వహించే సంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా మార్చిలో పౌరాణిక నటులు యడ్ల గోపాలరావు, మంగాదేవి ఆధ్వర్యాన పౌరాణిక నాటక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యాన జాతీయస్థాయి సప్తమి నృత్య ప్రదర్శనలు బాపూజీ కళామందిర్‌లో ఎంతగానో అలరించాయి. హైదరాబాద్ కిన్నెరా ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఆధ్వర్యాన 12 గంటల నిర్విరామ ఘంటసాల గీతాలాపన కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ యువ గాయకులు కారుణ్య గీతాలాపనలు ఆకర్షణ నియంగా నిలిచింది.

అదేవిధంగా నృత్య దర్శకుడు రఘు పాత్రను శ్రీకాంత్ ఆధ్వర్యాన శిష్య బృందం జపాన్‌లో నృత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ మన జిల్లాకి ఖ్యాతి తీసుకొచ్చారు. కల్లేపల్లి సంప్రదాయం కూచిపూడి గురుకులం డైరెక్టర్ స్వాతి సోమనాథన్ అమెరికాలో శిష్య బృందంతో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అదేవిధంగా డిసెంబరులో కామసూత్ర నృత్య ప్రదర్శనలో భాగంగా అర్ధనారీశ్వరం పేరిట సంస్కృతిక కార్యక్రమం, నృత్య ప్రదర్శన ఇచ్చారు.

సమరశీల పోరాటాల్లో సిఐటియు ప్రత్యేక పాత్ర

- సంఘం అఖిల భారత మహాసభ సందర్భంగా 'ప్రజాశక్తి'తో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'సిఐటియు ఒక ప్రత్యేక పరిస్థితుల్లో, చారిత్రక సందర్భంలో దేశంలో స్థాపించబడింది. నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఒక్క ట్రేడ్ యూనియన్ కూడా నాడు మిగల్లేదు. స్వాతంత్ర్య పోరాటంలో సమరశీలంగా వ్యవహరించిన ఎఐటియుసి నెహ్రూ ప్రభుత్వాన్ని బలపరచడాలని నిర్ణయించడంతో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రశ్నించే ట్రేడ్ యూనియన్ లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికవర్గ హక్కుల కోసం పోరాడే సంస్థగా సిఐటియు ఆవిర్భవించింది' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖ బీచ్ రోడ్డులోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో సిఐటియు పోరాటాల ప్రత్యేకత, విధానంపై ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాటి పరిస్థితులు ఇలా..

1967లో దేశ వ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పాటు జరిగాయి. నెహ్రూ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అండగా ఉందని రుజువైన కాలం అది. 1970 మే 31న అనివార్య పరిస్థితుల్లో సిఐటియు ఒక లక్ష్యంగల సంస్థగా ఐక్యతా పోరాటం నినాదంతో స్థాపించబడింది. జూన్‌లోనే దేశ వ్యాప్తంగా కార్మికవర్గ ఐక్యత కోసం పిలుపునిచ్చింది. కానీ ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడిన సిఐటియును ఇతర సంఘాలు అవహేళనగా మాట్లేడే పరిస్థితి నాడు ఉండేది. 1970లో ఒక సంఘం అఖిలభారత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు బోర్డును ఎక్కడ పెడతారంటూ ప్రశ్నించేవారు. అంటే సిఐటియు చాలా నామమాత్రంగా ఉండేదని వారి విమర్శ. 1977 నాటికి దేశ వ్యాప్తంగా వామపక్ష ప్రభుత్వాలు బెంగాల్, కేరళ, త్రిపురలో ఏర్పడ్డాయి. సిఐటియు అత్యంత సమరశీల పోరాటాలు చేసే సంస్థగా కార్మిక సంస్థలు, కార్మికులు గుర్తించారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెలో కామ్రేడ్ సమర్ ముఖర్జీ ఛైర్మన్‌గా రైల్వే పోరాటంలో కీలకపాత్ర పోషించారు. ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే పోరాటం సహా కార్మిక ఉద్యమాలను తీవ్రంగా అణచివేసింది. 1976లో ఎమర్జెన్సీని వ్యతిరేకించి నిలబడ్డ ఏకైక కార్మిక సంస్థ సిఐటియు మాత్రమే. తొలి నుంచీ కార్మికుల హృదయాల్లో సిఐటియుది చిరస్మరణీయ స్థానం.

ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు ప్రారంభ రోజుల్లో...

రాష్ట్రంలో సిఐటియు ప్రారంభ రోజుల్లో అనేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంది. సిఐటియు రాష్ట్ర కేంద్రం, ఢిల్లీ కేంద్రం అధ్యక్షులు పర్సా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసింది. శ్రీహరి, లక్ష్మయ్య హైదరాబాద్‌లోని ఎంవి.భాస్కరరావు సహకారంతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సిఐటియు సంఘాలు అతి వేగంగా నెలకొల్పడం జరిగింది. రాజమండ్రిలో బాలాజీదాస్ నాయత్వంలో పేపర్ మిల్లు పోరాటం, రాయలసీమలో పోరాటం వంటి అనేక ఉద్యమాల ఫలితంగా కార్మికుల ఆదరణ పొందింది.

టిటిడిలో పోరాటాలు

నాడు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆద్వర్యంలోనే రవాణా బస్సులు నడిచేవి. అలాగే అడ్డూలు తయారు చేసే కార్మికుల పని ప్రదేశం (పోటు) పనుల గురించి సిఐటియు పోరాడుతూ వారిని కార్మికులుగా గుర్తించి బోనస్ చెల్లించాలని సుప్రీం కోర్టులో సమస్యను లేవనెత్తి విజయం సాధించడం విశేషం. జస్టిస్ కృష్ణయ్య న్యాయమూర్తిగా ఆనాడు ఉండేవారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు హైదరాబాద్, విశాఖలోనే కేంద్రీకరించబడి ఉండేవి. 1990 నాటికి ఈ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సిఐటియు సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రంగ కార్మికుల్లో ఒక బలమైన స్థానాన్ని సిఐటియు సంపాదించింది. దీని ఫలితంగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాల్లో హైదరాబాద్‌లోని ఐడిపిఎల్, హెచ్‌ఎంటి కార్మికులు ఎన్నో విజయాలు సాధించారు.

వందల సంఖ్యలో సంఘాలకు సిఐటియు నాయకత్వం

విశాఖ ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ షిప్‌యార్డు, పోర్టు, స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థల్లో సిఐటియు ఒకటి లేదా రెండు స్థానాల్లో నిలబడింది. ప్రతి జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులను సమీకరించడంలో అద్భుతమైన కృషి చేసింది. భీమవరం కేంద్రంగా రైస్ మిల్లు కార్మికులను, హోటల్స్ హమాలీలను ఇతర అనేక రంగాల కూలీలను సమీకరించి నిరంతర పోరాటాలను నిర్వహించింది. వీటి ఫలితంగా నేడు స్కీం కార్మికులు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలుకొని భవన నిర్మాణం, తోపుడు బళ్ళ కార్మికులు సహా చిన్నా, పెద్దా కలిపి 580కి పైగా సంఘాలకు వివిధ రంగాల్లో సిఐటియు నాయకత్వం వహిస్తోంది.

సిఐటియు జెండా నీడన ఐక్య పోరాటాలు మరుపురాని విజయాలు

- స్కీమ్ వర్కర్ల మనోగతం ఇదీ...



అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ డే వేడుక



భీమిలిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'ఐక్యత పోరాటం' నినాదాన్ని అందిపుచ్చుకుని సిఐటియు జెండా నీడన హక్కుల సాధన, పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి స్కీంవర్కర్ల ఐక్యపోరాటాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. గుర్రాలతో తొక్కింపు, పోలీసుల లాఠీల దెబ్బలు, అక్రమ కేసులు, వేధింపులు ఇలా ప్రతికూల పరిస్థితుల్లో కూడా సమరశీల పోరాటాలతో ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కొన్ని సౌకర్యాలను, హక్కులను సాధించగలిగారు. మొదటి నుంచి తమకు అండదండగా ఉంటున్న సిఐటియు అఖిల భారత మహాసభ నవ్యాంధ్రలో మొదటిసారిగా విశాఖ మహాసగరంలో ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు జరగనున్న నేపథ్యంలో దాన్ని విజయవంతం చేసేందుకు స్కీం వర్కర్లు సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే ర్యాలీలు, సదస్సులు, ఇతర మార్గాల్లో మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం నిర్వహించిన స్కీం వర్కర్లు వచ్చేనెల 4న విశాఖలో జరిగే కార్మిక మహా ప్రదర్శన ర్యాలీ, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగసభకు తరలివెళ్లేందుకు సన్నద్ధమౌతున్నారు. సిఐటియు అఖిలభారత మహాసభ నేపథ్యంలో కొందరు స్కీంవర్కర్ల మనోగతమిది.

పోరాడి హక్కుల సాధన



పిల్లలకు సేవ చేయొచ్చన్న ఆలోచనతో అంగన్వాడీ కార్యకర్తగా ఉద్యోగంలో చేరినా వచ్చిన అరకొర వేతనంతో జీవనం కష్టం కావడంతో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో దశలవారీగా రూ.2,200 నుంచి నేడు రూ 11,500 వేతనం సాధించుకున్నాం. ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్వాడీలకు ఇంకా పనిభారం, వేతన, ఉద్యోగభద్రత సమస్యలున్నాయి. కనీస వేతనం రూ.26వేలు అమలు, ఉద్యోగభద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలుకు పోరాటం చేస్తున్నాం. సిఐటియు అండతో ఇప్పటివరకు కొన్ని హక్కులను సాధించుకున్నాం. ఇదేరీతిన సమరశీల పోరాటాలు చేసి మిగతా హక్కులను సాధించుకుంటాం.

దొంతల కాసులమ్మ,
అంగన్వాడీ కార్యకర్త
ఆనందపురం

పారితోషికం నుంచి వేతనం వరకు...

సిఐటియు జెండా నీడన సమిష్టిగా పోరాటంతో పనికిచ్చే పారితోషికం నుంచి నేడు నెలసరి రూ.పది వేల వేతనం పొందేస్థాయికి చేరుకున్నాం. గర్భిణి పేరు నమోదు, ఆసుపత్రికి తరలింపు, ప్రసవాలు, వ్యాక్సినేషన్ ఇలా చేసిన ఒక్కో పనికి ఇంతమొత్తం అంటూ మొక్కుబడి పారితోషికం ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో ఆసుపత్రికి రానుపోను ఖర్చులకైనా సరిపోయేది కాదు. కుటుంబపోషణ కష్టంగా ఉండేది. సిఐటియు అండతో పోరాటం చేసి నేడు రూ.పదివేల వేతనం సాధించాం.యాప్‌లు, ఇతర పనిభారం పెరిగింది. ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనాలు ఇవ్వాలి. ఇఎస్ఐ, పిఎఫ్,గ్రాట్యూటీ ఇతర సౌకర్యాలు అమలు చేయాలి

పి సూర్యకళ, ఆశా కార్యకర్త
తోటవీధి జివిఎంసి మూడోవార్డు, భీమిలి



గర్భిణిని ఆసుపత్రికి తీసుకొచ్చిన ఆశా సూర్యకళ

పోరాటం కొనసాగిస్తాం



మధ్యాహ్న భోజన పథకం అమలు తొలినాళ్లలో కర్రల పొయ్యిపై అన్నం, సాంబారు వండి వడ్డించే వాళ్లం. తర్వాత వంటగ్యాస్‌పై వంట చేసే వాళ్ళం. అటు తర్వాత అక్షయపాత్ర సంస్థకు వంట నిర్వహణను అప్పగించి, మధ్యాహ్నభోజన కార్మికులకు అన్యాయం చేశారు. కొంతకాలం తర్వాత సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో రూ.వెయ్యి వేతనం సాధించుకుని తర్వాత రూ.మూడు వేలకు పెంచారు. అయితే వేతన చెల్లింపు సక్రమంగా లేదు. కనీస వేతనం రూ.26వేలు అమలు, ప్రమాదబీమా వర్తింపు, పిఎఫ్, గ్రాట్యూటీ, ఇతర సౌకర్యాలకు పోరాటం కొనసాగిస్తాం

ఎం.గురమ్మ,
మధ్యాహ్న భోజన కార్మికురాలు
ఎగువపేట, జివిఎంసి మూడో వార్డు, భీమిలి

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
ఆదివారం 28
డిసెంబర్ 2025

శ్రామిక ఉత్సవ్ అదుర్స్

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4 VISAKHAPATNAM

ఉత్తేజంగా సాగిన కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
ఆకట్టుకున్న గేయాలు, నృత్యాలు

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నుంచి తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. అందరిలో ఉత్తేజం, చైతన్యం నింపింది. ఓ పెద్ద పండగలా ఈ ఉత్సవ్ సాగింది. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భారీగా కార్మికులు, మేధావులు, కళాకారులు తరలివచ్చారు. ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ డప్పు కొట్టి ఉత్సవ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలను ప్రముఖులు ప్రారంభించారు. కళారూపాలతో ఉత్సవ వేదిక హోరెత్తింది.



ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు



శ్రామిక ఉత్సవ్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాష్ రాజ్



సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్న గుజరాత్ కళాకారులు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, చిత్రంలో ఎంవిఎస్.శర్మ, రమణమూర్తి, తెలకపల్లి రవి



శ్రామిక ఉత్సవ్ వేదికపై నుంచి నినదిస్తున్న ప్రకాష్ రాజ్, సిహెచ్.నర్సింగరావు, గపూర్, తెలకపల్లి రవి, రమణమూర్తి, దాడి సత్యనారాయణ, కుమార్, రమాప్రభ తదితరులు





అదరహో అనిపించేలా సాగిన నృత్య ప్రదర్శనలు



నృత్యాలతో ఆకట్టుకున్న పిఎన్ఎం కళాకారులు



దాడి సత్యనారాయణకు జ్ఞాపిక బహూకరణ



ప్రకాష్ రాజ్‌కు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నాయకులు



కార్టూన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.నర్సింగరావు



గాజు పెంకులపై నడక



షార్ట్ ఫిల్మ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సత్యానంద్ తదితరులు

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ప్రత్యేకం

జ్యూట్ కార్మికోద్యమంలో మైలురాయి 9ఎ పోరాటం

పాలకుల మెడలు వంచి.. యాజమాన్యం కుయుక్తులను తుత్తునియలు చేసిన 2003 నాటి ఉద్యమం



మూతపడిన చిట్టివలస జ్యూట్ మిల్లు ఇదే..

ప్రజాశక్తి-భీమునిపట్నం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా 2003లో జరిగిన పోరాటం జ్యూట్ కార్మికోద్యమంలోనే ఒక మైలురాయి వంటిది. సముద్రంలో ఉవ్వెత్తున లేచిన కెరటం వలె, చిట్టివలస జ్యూట్ కార్మికులు చేసిన ఈ పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికవర్గంపై తీవ్రంగా ప్రభావం చూపింది. పాలకుల కుట్రలు, యాజమాన్యం కుయుక్తులను జ్యూట్ కార్మికులు తుత్తునియలు చేశారు. 118 రోజుల పాటు జ్యూట్ కార్మిక వర్గం జరిపిన ఈ వీరోచిత పోరాటం స్ఫూర్తిదాయకమైనది.

ఉమ్మడి రాష్ట్రంలోని జ్యూట్ యాజమాన్యాలు పోటీ పడుతూ దాదాపు అన్ని మిల్లుల్లోనూ కార్మిక హక్కులపై దాడి చేసిన కాలమది. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 9(ఎ) కింద కార్మిక హక్కులను హరించే 13 అంశాలతో చిట్టివలస జ్యూట్ యాజమాన్యం నోటీసు జారీ చేసింది. ఇది 2003 జూన్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. ఇందులో డిఎలో ప్రతిష్టంభన, పని భారం పెంపు, ఉత్పత్తితో జీతాలను ముడిపెట్టడం లాంటి ప్రధానమైన కార్మిక వ్యతిరేక చర్యలు ఉన్నాయి. ఈ విధానాలను యథేచ్ఛగా అమలుకు పూనుకోవడంతో సిఐటియు కార్మిక వర్గ ఐక్య పోరాటాలకు సిద్ధమైంది. ఆ సమయంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో చిట్టివలస జ్యూట్ మిల్స్ మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుర్తింపు సంఘంగా ఉంది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా అప్పట్లో ప్రతిపక్ష కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘటిత పోరాటాలను నడపడంలో, సమరశీలతను ప్రదర్శించడంలో సిఐటియు కీలక పాత్ర పోషించింది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మిక వర్గం పోరాటాలు చేసింది. ఇదే సమయంలో 2003 సెప్టెంబర్ 7న అప్పటి టిడిపి ప్రభుత్వంలో కార్మిక శాఖా మంత్రిగా ఉన్న బాబూమోహన్‌కు విశాఖ ప్రభుత్వ అతిథి గహం వద్ద వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నం చేయగా, అనుమతించకపోవడంతో అక్కడే ఆందోళన చేపట్టారు. సెప్టెంబర్ 8న మంత్రి బాబూమోహన్ విశాఖ నుంచి విజయనగరం కారులో రాత్రివేళ వస్తుండగా తగరపువలస హైవేపై జ్యూట్ కార్మికులు ఆయన్ను ఘరావ్ చేశారు. సెప్టెంబర్ 16న జైల్ భరో నిర్వహించారు. ఈ సందర్భంగా 118 మంది కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడంతో సెప్టెంబర్ 21న తగరపువలస జంక్షన్‌లో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటిని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వివి.రామారావు, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఇటువంటి సమయంలో సెప్టెంబర్ 24న ప్రభుత్వం జ్యూట్ ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. అర్ధరాత్రి నిరవధిక దీక్షా శిబిరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు బూటు కాళ్ళతో తొక్కి, లాఠీఛార్జీ చేసి దీక్షా శిబిరంలో భయానక వాతావరణం సృష్టించారు. ఆరోగ్యం క్షీణించిందన్న కారణంతో దీక్షలు చేస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, గుర్తింపు సంఘం నాయకులు ఎస్.రమేష్, జ్యూట్ కార్మిక సంఘాల నేతలు బాబూరావు, అప్పలరెడ్డిలను కేజీహెచ్‌కు తరలించారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్మికులపై అమానుషంగా లాఠీచార్జి చేసి 70 మంది కార్మికులను అరెస్ట్ చేశారు. సిఐటియు నేత ఎస్.రమేష్ మెడపై పోలీసులు బూటు కాళ్లతో తొక్కడం పోలీసు దమనకాండకు నిదర్శనం. అప్పటి ప్రభుత్వ, పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా, జ్యూట్ కార్మిక పోరాటానికి సంఘీభావం తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన రంగాల కార్మికులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. కెజిహెచ్ నుండి వచ్చి కలెక్టరేట్ వద్ద దీక్షలు చేశారు. అనంతరం మళ్లీ తగరపువలసలో దీక్షలను ప్రారంభించారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం, యాజమాన్యం దిగొచ్చాయి. సెప్టెంబర్ 26న 9 (ఎ) నోటీసులోని కార్మికులకు నష్టం చేసే అంశాలను యాజమాన్యం ఉపసంహరించుకుంది. జ్యూట్ కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. అప్పటి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజశర్మ చేతుల మీదుగా గ్లూకోజ్ నీళ్ళు ఇచ్చి సిహెచ్.నరసింగరావు చేపట్టిన దీక్షను విరమింపజేశారు. సెప్టెంబర్ 27న సాయంత్రం 7గంటలకు విజయోత్సవసభ నిర్వహించారు. జ్యూట్ కార్మిక వర్గం జరిపిన పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని ఇప్పటికీ జ్యూట్ కార్మికులు చెప్పుకుంటున్నారు.



తగరపువలస జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు (ఫైల్ ఫొటో)

యాజమాన్యం కవ్వింపు చర్యలు.. అడ్డుకున్న సిఐటియు

సిఐటియు గుర్తింపు సంఘంగా ఉన్న ప్రతి సందర్భంలోనూ జ్యూట్ యాజమాన్యం అనేక రూపాల్లో కార్మికులపై కవ్వింపు చర్యలకు పాల్పడేది. క్యాంటీన్ రేట్లు పెంచేందుకు, పలు డిపార్ట్‌మెంట్లలో కార్మికులపై పని భారం పెంచేందుకు యాజమాన్యం పలు సందర్భాల్లో జరిపిన ప్రయత్నాలను సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు అడ్డుకున్నారు. ఇలా యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడ్డ ప్రతి సందర్భంలోనూ కార్మికులు కలిసి కట్టుగా ప్రతిఘటించారు.



జ్యూట్ కార్మికుల నిరవధిక దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు (ఫైల్ ఫొటో)



షిప్‌యార్డు ప్రైవేటీరణకు అడ్డుకట్ట

- సిఐటియుది గొప్ప పోరాటం
- జాతీయ మహాసభ విజయవంతానికి కార్మికులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరుగనున్న సిఐటియ జాతీయ మహాసభలు అత్యంత కీలకమైనవని, విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను ప్రయివేటీకరణకు గురికాకుండా కాపాడడంలో ఏళ్లతరబడి సిఐటియు సాగించిన ఉద్యమాలను ఈ సందర్భంగా షిప్‌యార్డు కార్మికులు, ఉద్యోగులు గుర్తుకు తెచ్చుకుంటున్నారని **షిప్‌యార్డు లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వి.ప్రసాద్** వెల్లడించారు. సిఐటియు మహాసభ సందర్భంగా ప్రసాద్ ప్రజాశక్తితో మాట్లాడుతూ, షిప్‌యార్డులో యూనియన్ స్థాపించిన నుంచి నేటివరకు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా షిప్‌యార్డు ప్రయివేటుపరం కాకుండా కాపాడుకున్నట్లు తెలిపారు. పోరాటాలకు సంబంధించి ఆయన మాటల్లోనే...

జిఎంఎల్ ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర...

కేంద్ర ప్రభుత్వం జిఎంఎల్ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలని చూడగా ప్రభుత్వ రంగంలో కొనసాగేలాగ సిఐటియు కృషి చేసి నిలువరించింది. సిపిఎం నేత సీతారాం ఏచూరి చేసిన కృషి షిప్‌యార్డు విషయంలో ఎనలేనిది. డిఫెన్స్‌లో విలీనం చేసేంతవరకూ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు, షిప్‌యార్డు రక్షణకు ఎంతగానో తోడ్పడ్డాయి. దేశంలో ఎక్కడా పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ లేని రోజుల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌కె మిశ్రా సహకారంతో 275మందిని సిఐటియు పర్మినెంట్ చేయించింది. సిఐటియు కృషితో 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్)ల వర్క్ ఆర్డర్స్ షిప్‌యార్డుకు దక్కింది. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిఫెన్స్ మినిస్ట్రీకి లేఖ రాస్తూ పెండింగ్‌లో ఉన్న 5 ఎఫ్‌ఎస్-ఎస్‌లు హిందుస్థాన్ షిప్‌యార్డుకు కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ విధానాలతో పర్మినెంట్ ఉద్యోగుల తరుగుదల...

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్ల పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. 2010లో పర్మినెంట్ ఉద్యోగులు 4వేల మంది ఉండగా నేటికి 310కి కుదింపబడ్డారు. ప్రధాన డిపార్టమెంట్‌లన్నీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోవడంతో యార్డులో కాంట్రాక్టీకరణ పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డును ఈ విధంగా ప్రయివేటీకరణ చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ ప్రయివేటీకరణ విధానాలపైనా, షిప్‌యార్డును పూర్తిగా ప్రభుత్వ రంగంలో నిలిపేందుకు సిఐటియు సాగిస్తున్న అవిరళ కృషి అజరామరమైనది.

ప్రయివేటుకు షిప్‌ల కాంట్రాక్టును వ్యతిరేకిస్తున్న సిఐటియు

5 ఎఫ్‌ఎస్‌ఎస్‌ల వర్క్ ఆర్డర్ షిప్‌యార్డుకు వచ్చినప్పటికీ అందులో 2 ఎల్‌అడ్‌టికి కేటాయించడాన్ని సిఐటియు మొదటనుంచీ వ్యతిరేకిస్తూ పోరాడుతోంది. దీనివల్ల షిప్‌యార్డు ఆర్థికంగా నష్టపోతుంది. 4 ఎల్‌పిడిఎస్ 2012లో హెచ్‌ఎస్‌ఎల్‌కు కేటాయిస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం చెప్పింది. డిఫెన్స్ అక్విలైజేషన్ కమిటీ (డిఎసి) కూడా రూ.33వేల కోట్లతో 4 ఎల్‌పిడిఎస్‌ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. హిందుస్థాన్ షిప్‌యార్డుకే ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. పెట్రోలియం, సహజవాయువులు, ఉక్కు, ఎరువుల రంగాలు, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి 207 షిప్పులను షిప్‌యార్డు నిర్మించాలని ప్రణాళిక రచించడం మంచి పరిణామం. దీంట్లో ట్యాంకర్లు, బల్క్ కారియర్‌లు, లైనర్లు, అఫ్‌షోర్ సరఫరా నౌకలతో సహా 55 నౌకలు ఉన్నాయి. ఇతర అన్ని రకాల 800 షిప్‌లు దేశానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ షిప్పులు ఇవ్వడానికి హెచ్‌ఎస్‌ఎల్‌ను పరిగణలోకి తీసుకోవాలని సిఐటియు పోరాడుతోంది.

ఎల్‌అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల పర్మినెంట్...

348 ఎల్‌అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ నుంచి వచ్చిన ఉద్యోగులు, మెడికల్ డెత్ డిసీజ్డ్ ఎంప్లాయీస్ కలిపి 670 మంది ఉండేవారు. దీంట్లో 2014లో 149 మందిని పర్మినెంట్ చేయాలని దఫదఫాలుగా యాజమాన్యాన్ని సిఐటియు కోరుతోంది. కొంతమందిని పర్మినెంట్ చేసి మిగిలిన వారిని పర్మినెంట్ చేయకుండా ఉంచడం ఆర్టికల్ 14 ప్రకారం వివక్ష చూపడమే కావున మిగతా వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తోంది.

షిప్‌యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి...

దేశంలోనే అతిపురాతనమైన తొలి నౌకా నిర్మాణ కేంద్రం హిందుస్థాన్ షిప్‌యార్డు. దీంట్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సిఐటియు తొలినుంచీ పోరాడుతోంది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డు అభివృద్ధికి సుమారు రూ.19వేల కోట్లు కేటాయించింది. షిప్‌యార్డు కంపెనీ, షిప్‌యార్డు కాలనీ కలిపితే 281 ఎకరాల భూమి. విశాఖ పోర్టు నుంచి 99 ఏళ్ల లీజుకు తీసుకుంది. ఆ లీజు కొన్ని సంవత్సరాల్లో పూర్తవుతున్నందున ఆ భూమి మొత్తం షిప్‌యార్డులోకి మార్చాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. న్యాయబద్ధంగా స్టాఫ్ అండ్ వర్క్‌మెన్‌లకు ప్రమోషన్లు కల్పించాలని 10ఏళ్లుగా సిఐటియు పోరాడుతోంది. పదోన్నతులు ఇవ్వకుండా ఏళ్లతరబడి ఒకే కేటగిరిలో ఉంచడాన్ని వ్యతిరేకిస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్‌ఐ సక్రమంగా అమలు చేయాలని సిఐటియు పోరాడుతూనే ఉంది.

పిఎంపిల సేవలు వెలకట్టలేనివి



పిఎంపిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ వైద్యసేవలు అందించడంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (పిఎంపి) పాత్ర మరువలేనిదని, 63 ఏళ్లుగా నిరంతరాయంగా అసోసియేషన్ సేవలు అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక పిఎన్ కాలనీలోని తన్మయి కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అసోసియేషన్ 63వ వసంతాల వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సామాజిక బాధ్యతగా యువతకు అవయవదానం, కేన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయ కమన్నారు. అసోసియేషన్‌కు సొంత భవనం ఏర్పాటు చేసే అంశాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. పిఎంపిలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సాంకేతిక సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా, వ్యక్తిగతంగా రాష్ట్ర నాయకత్వంతో చర్చించి సత్వర పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ వేడుకల్లో పిఎంపి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎ.ఆదినారాయణ, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీ సిహెచ్ రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు డాక్టర్ కె.భరద్వాజ్, డాక్టర్ ఎం.వెంకటరమణ, డాక్టర్ ప్రదీప్ వెంట్రపతి, కె.జనార్దనరావు, డాక్టర్ వాసు, కవ్వాడి సుశీల, స్థానికులు పాల్గొన్నారు.

స్వామిబాబుకు నివాళి

ప్రజాశక్తి- అరసవల్లి

కవి, స్వాతంత్ర సమరయోధులు పొట్నూరు స్వామిబాబు జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు అందవరపు సూరిబాబు మాట్లాడుతూ స్వామిబాబు గొప్ప దేశభక్తుడని, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర వహించారన్నారు. స్వామిబాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సూరు రామారావు, భాస్కరరావు, వైశ్యరాజు, పి.తులసీరాం, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి- అరసవల్లి

స్థానిక రిమ్స్ ఆస్పత్రిలో శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు నిర్వహిస్తున్న నిత్య అన్నపూర్ణ పథకానికి చాపర గ్రామానికి చెందిన తంగుడు ఇందిర కుమారులు తంగుడు సునీల్ కుమార్, వెంకట సమీర్‌తో కలిసి తన భర్త తంగుడు సుధాకర్ జ్ఞాపకార్థం నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని రాష్ట్ర అధ్యక్షులు రఘు పాత్రుని లక్ష్మణరావుకు చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జిల్లా పదాధికారులు పప్పల నాగేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ గోవిందరావు

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

యుటిఎఫ్ కేలండర్, డైరీలను ఎంఇఒ డబ్బిరు గోవిందరావు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వాసుదేవరావు నారాయణరావు తవిటమ్మ ఆనందరావు సింహాచలం, మన్మధరావు, కృష్ణారావు, చంద్రమోహన్ పాల్గొన్నారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

210 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొండవలసలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన కనిపించింది. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 210 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం కొంతమంది రోగులను ఉన్నత వైద్య సేవలకు గుర్తించడంతో పాటు మిగిలిన రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు లావేటి పూర్ణారావు, లోలుగు నీలం నాయుడు, జనార్దనరావు, టి.సునీత, కార్యదర్శి జి.రాము పాల్గొన్నారు.

కారు బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం చిలకపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒడిశా నుంచి బెంగుళూరు వెళ్తున్న ఓ కారు బోల్తాపడడంతో డ్రైవర్ ఎస్.అర్జున్ (27) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు బెంగుళూరు (కర్ణాటక) బత్రానిపురానికి చెందిన ఎన్.నవీన్ తన స్నేహితులతో కలిసి ఒడిశాలోని ఆలయాల సందర్శనకు వెళ్లి తిరిగి బెంగుళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ ఎస్.అర్జున్ అతి వేగంగా కారును నడపడంతో వెనుక టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ అర్జున్‌ను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారులో డ్రైవర్‌తో సహ ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ సంఘటనలో డ్రైవర్ అర్జున్ మృతిచెందగా, మిగిలిన నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గత మూడు నెలలుగా జిఒ ప్రకారం వేతనాలు చెల్లించకుండా సెక్యూరిటీ గార్డుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తున్న శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం నియంత వైఖరి మానుకోవాలని ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులను నిత్యం వేధిస్తూ క్యాజువల్ లీవులు మంజూరు చేయకుండా, 30 మంది పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకుండా కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తున్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు లిమిటెడ్ యాజమాన్యంపై రిమ్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని శనివారం ఆందోళన తెలియజేశారు. రిమ్స్ ఆస్పత్రిలో వివిధ రకాల కాంట్రాక్టర్లు చట్టాన్ని ఉల్లంఘించి యధేచ్ఛగా కార్మికుల శ్రమ దోపిడీ చేస్తూ జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కార్మికులను భయపెట్టి పలు రకాల భ్రమలకు గురిచేసి ఇబ్బందులకు చేస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే జిల్లా కలెక్టర్ సంబంధిత యాజమాన్యాలను టెర్మినేట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు సవలాపురపు కృష్ణవేణి యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను గొల్లపల్లి రాజులు, బగాది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం జిఒ నెంబర్ 138 ప్రకారం రూ.18,600 వేతనం ఇవ్వాలని స్పష్టంగా చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ దాన్ని అమలు చేయకపోతే రిమ్స్ అధికారులు వారికి ఏ రకంగా 96 శాతం ఫెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు, ఎలా ఇస్తున్నారు, వారికే తెలియాలన్నారు. క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు లిమిటెడ్ యాజమాన్యం వారు 30 మంది పారిశుధ్య కార్మికులకు జిఒ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, జిల్లా అధ్యక్షులు మామిడి క్రాంతి, జోగి వెంకటరమణ, దామోదర రవికుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సెక్యూరిటీ గార్డులు



విద్యుత్ స్తంభాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న సర్పంచ్ ప్రతినిధి మధు

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి- పొందూరు

మండలం వి.ఆర్.గూడెంలో నూతన విద్యుత్ స్తంభాలను శనివారం సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామంలో పలుచోట్ల పాడైపోయిన, అలాగే సిసి రహదారుల మధ్యలో గల సుమారు 18 విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సురేష్ తదితరులు

సురేష్ పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లి గ్రామానికి చెందిన సమతం సత్యనారాయణ ఇటీవల హఠాన్మరణం చెందడంతో శనివారం ఆయన కుటుంబసభ్యులను లావేరు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ పరామర్శించారు. సంతాపాన్ని వ్యక్తం చేసి మృతిని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈయన వెంట సర్పంచ్ బాడిత లక్ష్మణరావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు బాడిత చిట్టిబాబు, రేషన్ డీలర్ బాడిత హరికృష్ణ, వెంకట రామారావు తదితరులున్నారు.

వ్యాపారుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే స్పందన

రణస్థలం: రణస్థలం జంక్షన్ వద్ద జరుగుతున్న హైవే పనుల కారణంగా మార్కెట్ మార్గంలో రాకపోకలు నిలిపి వేయడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వ్యాపారులు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. శనివారం ఎమ్మెల్యే వద్దకు వ్యాపారులు వచ్చి సమస్యను తెలియజేశారు. జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు మూసివేయడంతో కస్టమర్లు రావడం ఆగిపోయి, రోజువారీ ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నా మన్నారు. పండుగ సమయం కావడంతో ఈ 15 రోజులు రాకపోకలకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని ఎమ్మెల్యే వెంటనే హైవే అధికారులతో మాట్లాడారు. ప్రజలకు అలానే వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే చొరవతో అధికారులు తక్షణమే స్పందించి రాకపోకలకు మార్గం కల్పించారు. తమ కష్టాన్ని అర్థం చేసుకుని జీవనోపాధి సమస్య పరిష్కరించినందుకు వ్యాపారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఆర్‌పిలు ఎంపిక

జి.సిగడాం రూరల్ : స్థానిక మండల సమైఖ్య కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు సమావేశాలు నిర్వహించుటకు, మన డబ్బులు మన లెక్కలపై సభ్యులకు అవగాహన కల్పించుటకు, సంఘాలు మరింత బలోపేతం చేయుటకు, సభ్యుల జీవనోపాధులు మెరుగుపరుచుటకు, సంఘాల పుస్తక నిర్వహణకు, ప్రతి గ్రామంలో 25 సంఘాలలోపు ఉన్న గ్రామాల్లో ఇద్దరు సిఆర్‌పిలను, 25 సంఘాలపైబడి ఉన్న గ్రామాల్లో ప్రతి 10 సంఘాలకు ఒక ఈనారి, ఇద్దరు లైలిహుడ్ సిఆర్‌పిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు చిద్రి లక్ష్మి, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కళ్యాణి తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం

లావేరు: మండలంలోని గురుగుబిల్లి గ్రామ పంచాయతీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం సర్పంచ్ బాడిత కళ్యాణి లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిసి రోడ్లు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో గురుగుబిల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు బాడిత చిట్టిబాబు, వెంకటరామారావు, రేషన్ డీలర్ హరికిష్ణ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

శ్రీకాకుళం సిటీ: కోవిడ్ తర్వాత వచ్చే పరిణామాల్లో ఎక్కువగా శ్వాసకోశకు సంబంధించి సమస్యలు ఎదురవు తున్నాయని, ఆయా బాధితులను కాపాడటానికి పెద్దపేటకు చెందిన యాక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ సంస్థ ద్వారా డైరెక్టర్ నూక సన్యాసిరావు సుమారు రూ.10 లక్షలుపైబడి విలువచేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సన్యాసిరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని ఆయా బాధితులను కాపాడు కోవడానికి తక్షణంగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు పి.జగన్మో హనరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేస్తున్న ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్

ఎస్‌పిని కలిసిన కాశీబుగ్గ డిఎస్‌పి



ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాశీబుగ్గ పోలీస్ సబ్ డివిజన్ నూతన డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన షేక్ షాహబాజ్ అహ్మద్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి నూతన నంగా బాధ్యతలు స్వీకరించిన డిఎస్‌పికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, విజిబుల్ పోలీసింగ్, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అంతన్నారింతన్నారో...



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

భూ సమస్యలపై రైతులు పడుతున్న ఇబ్బందులపై టిడిపి కూటమి ప్రభుత్వంలో కాస్త కదలిక వచ్చింది. భూ సమగ్ర సర్వే సందర్భంగా గత ప్రభుత్వం చేసిన పాపాల వల్లే రైతుల భూములు నిషేధిత జాబితా (22ఎ)లోకి వెళ్లిపోయాయని, ఒకరి భూమి వేరొకరి పేరు మీద మారిపోయాంటూ ఏడాది కాలంగా చెప్పుకుంటూ వచ్చిన కూటమి నేతలకు తత్వం బోధ పడినట్లు ఉంది. మీ పాస్ బుక్‌లపై జగన్ బొమ్మ వేసుకోవడమేమిటని, వాటిని చూపి బ్యాంకుల ద్వారా రుణం తీసుకుంటారని, జగన్ వస్తే మీ భూములు మీవి కావంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి వైసిపిపై రైతుల్లో కసి పెంచిన కూటమి నేతలకు వారి కోపం తమ వైపు మళ్లుతోందని గ్రహించి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు, భూ యజమానుల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నట్టు సర్వేలు, ఫీడ్ బ్యాక్ ఆధారంగా తెలుసుకున్న ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగానికి దిశా నిర్ధేశం చేస్తూ పలు మార్గదర్శకాలను వెలువరించింది. దీంతో పాటు కొన్ని రకాల సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం తహశీల్ధార్, ఆర్‌డిఒలకు కొన్ని అధికారాలను సైతం కల్పించింది. ప్రత్యేకించి 22ఎ భూముల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అందులో భాగంగానే ఈ నెల 26న జిల్లాలో 'మీ చేతికి...మీ భూమి' పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సైతం ఒక ప్రకటన విడుదల చేసి రైతులు, భూ యజమానులు వినియోగించుకోవాలని పిలుపు నివ్వడంతో పాటు జెడ్‌పిలో నిర్వహిస్తున్న సమావేశానికీ హాజరయ్యారు. అమాత్యులు, అధికారుల ప్రకటనలతో విస్తృతంగా ప్రచారం జరగడంతో రైతులు, భూయజమానులు భారీగా తరలివచ్చారు. అమాత్యులు ఉంటారు కాబట్టి తహశీల్దార్లు తమ పని చేసి పెడతారని రైతులు సంబరపడ్డారు. అటు రెవెన్యూ యంత్రాంగం కూడా భారీ ఏర్పాట్లు చేసింది. అమాత్యుల వారి ఆదేశాలతో గ్రామాలు, మండలాల్లో ఉన్న సమస్త రెవెన్యూ యంత్రాంగాన్ని మోహ రించింది. ఎన్నికలు మళ్లీ వచ్చాయా అన్న రీతిలో మూడు డివిజన్ల నుంచి వచ్చిన సిబ్బందిని మూడు వేర్వేరు టెంట్లలో కూర్చో బెట్టారు. జెడ్‌పి సమావేశం మందిరంలో లోపల తహశీల్దార్, సర్వేయర్ తదితరులు కంప్యూటర్లు, రికార్డుల వంటి సరంజామతో ఆసీనులయ్యారు. వేదికపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూర్చొన్నారు. సమావేశ మందిరంలోకి అడుగు పెట్టగానే రైతులు సమస్త రెవెన్యూ యంగ్రాంగాన్ని చూసి తొలుత ఆనంద పరవశులయ్యారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఎన్నోసార్లు గ్రీవెన్స్‌కు తిరిగామని, నేటితో తమ కష్టాలు తీరినట్లేనని అనుకున్నారు. అలా సమయం గడుస్తున్న కొద్దీ వారికి అర్థమైంది. ఇది సాధారణ రోజుల్లో నిర్వహించే గ్రీవెన్స్‌కు భిన్నమేమీ కాదని తెలుసుకున్నారు. అక్కడ వారికి ఎదురైన అనుభవాలు సేమ్ టు సేమ్ కావడంతో వీటి కోసం ఇంకా ఎన్నాళ్లు తిరగాలో అంటూ నిట్టూర్చారు. 22ఎ భూముల సమస్యల పరిష్కారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చినా ఇతర భూముల సమస్యలతో వచ్చిన వారి నుంచి వినతులనూ స్వీకరించారు. ఆ తర్వాత షరామామూలే. ఆయా మండలాల నుంచి వచ్చిన వినతులను మళ్లీ తహశీల్దార్ చేతిలోనే పెట్టారు. మీ చేతికి మీ భూమి అని గొప్పగా ప్రచారం చేసి చివరకు 'తహశీల్దార్ చేతికి మీ అర్జీ' అంటూ ముగించారు.

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు సమావేశ మందిరంలో ఒక వైపు అర్జీలను స్వీకరిస్తుండగా మరోవైపు పక్కనే ఉన్న ఛాంబర్‌లో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ 22 భూముల సమస్యలపై విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి తొమ్మిది గంటల వరకు సాగింది. తమ వంతు వరకు రైతులు ఓపికతో అలానే నిరీక్షించారు. సమస్య తీరితే అదే పది వేలనుకున్నారు. కానీ జెసి పరిశీలించిన వాటిలో కొన్నింటిని మళ్లీ తహశీల్దార్ టపాకే తిరుగు పంపారు. దీంతో రైతులు, భూ యజమానులు నిరాశతో వెనుదిరిగారు. భూ సమస్యల పరిష్కారంలో అధికారుల ప్లానింగ్ లోపం రైతులకు అవస్థలు మిగిలాయి తప్ప సమస్యలు తీరలేదు. జెసి స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలపై ఆర్‌డిఒల ద్వారా తహశీల్ధార్ల నుంచి లేఖలు పంపాల్సి ఉంటుంది. వాటిని ముందుగా సిద్ధం చేయించకుండా కంప్యూటర్లు, రికార్డులతో సిబ్బందిని వెంట బెట్టుకుని వస్తే ఏం ప్రయోజనం నెరవేరుతుందని అధికారులు భావించారో తెలియదు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మళ్లీ తహశీల్ధార్‌కే సిఫార్సు చేశారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో జరిగేది ఇదే. ఇందులో కొత్తగా చేసిందేముంది?

భూ సమస్యలపై వినతులతో మండలాలకు వెళ్తున్న రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పుడు బిజీగా ఉంది, వేరే పని మీద ఉన్నాం తర్వాత కలవాలంటూ ముప్పతిప్పలు పెడుతున్నారు. ఎప్పుడో తీరిక కుదిరినప్పుడు వారి నుంచి ఫిర్యాదు తీసుకుని కలెక్టరేట్‌కు పంపుతున్నారు. తమ ఫిర్యాదు ఏమైందంటూ రైతులు మండల కార్యాలయానికి కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రెండు మూడు పర్యాయాలు కలిసిన తర్వాత, కలెక్టర్‌కు పంపాం అది వస్తే పనైపోతుందంటూ సెలవిస్తున్నారు. కలెక్టరేట్ నుంచి అది రాదు, ఈ సమస్య పరిష్కారం కాదు. కొంత మంది తహశీల్దార్లు భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై ఆర్‌డిఒల ద్వారా జెసికి పంపాల్సి ఉన్నా వాటిని పంపడం లేదని తెలుస్తోంది. ఒక్కో లెటర్ తయారు చేయడానికి కొంత సమయం తీసుకోవడం, వాటిని ఆర్‌డిఒలకు పంపడం పెద్ద పనిగా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. .పైగా అది ఆదాయం వచ్చే పని కాకపోవడంతో పెద్దగా వాటిపై దృష్టి సారిండచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో ఫలితంగా రైతులు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. గ్రీవెన్స్ నుంచి మండలాలకు పంపుతున్న ఫిర్యాదుల పరిస్థితిని అడిగే నాథుడే కరువవ్వడంతో భూ సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోతున్నాయి. రైతు మెత్తనోడయితే గుర్రం మూడు కాళ్లతో నడిచిన చందంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మెతక వైఖరితో మండలస్థాయి అధికారుల్లో కదలిక కనిపించడం లేదు. ఇప్పటికైనా వారు భూ సమస్యలపై ఫిర్యాదుల పరిష్కారం విషయంలో కఠినంగా ఉండటంతో పాటు వినతులపై కచ్చితమైన సమాచారంతో సమీక్షలు జరిపితే రైతులకు కాస్తాయినా మేలు ఒనగూరుతుంది తప్ప ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌ల పేరుతో నిర్వహించే కార్యక్రమాలు అంతా షోగానే మిగిలిపోతాయనే విషయం గుర్తించాలి.

క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఆమదాలవలస: ఉమ్మడి జిల్లా ప్రాంతీయ స్థాయి అండర్ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీలు (ఐపిఎస్ జిఎమ్ -2025) ప్రభుత్వ పాలిటెక్నిక్ శ్రీకాకుళంలో నిర్వహించగా ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆమదాలవలస కళాశాల నుంచి 47 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 18 మంది విజేతలుగా నిలిచి కళాశాలకు గౌరవం తెచ్చారు. బ్యాడ్మింటన్ డబుల్స్ బాలికల విభాగంలో ఇద్దరు విద్యార్థినులు, 1500 మీటర్ల పరుగు పందెంలో విజయం సాధించిన విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ బి.జానకిరామ్ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరగనున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నిడిగంటల పద్మ, వైస్ చైర్మన్ బురాడ వెంకట రమణ ఆధ్వర్యంలో డైరెక్టర్లు అంతా శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును నడుకుదిటి పాళెంలోని క్యాంపు కార్యాల యంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్ర మానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వాని ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ అందరూ సమిష్టిగా పనిచేసి మార్కెట్ కమిటీ అభివృద్ధికి దోహదపడాలన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారు?

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



నిరసన తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఎప్పుడు కల్పిస్తారని, ఈ ఏడాది జనవరి మాసంలోనైనా జాబ్ కేలండర్ విడుదల చేస్తారా అంటూ ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు నిరసన, భిక్షాటన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టు కోవాలని, జనవరి 1న జాబ్ కేలండర్ ప్రకటించాలని, నిరుద్యోగ యువతకు రూ. 3 వేలు వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలం చెందారన్నారు. ఈ జనవరి ఒకటికైనా జాబ్ కేలండర్ విడుదల చే యాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత రోడ్లపై పడుతున్నారని, మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై ఆ మత్తులో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని, ఈ హత్యలన్నీ ప్రభుత్వ వైఫల్య హత్యలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సాంబశివరాజు, నాయకులు అమోస్, అన్నాజీ, వసంత్, జగదీష్, సూర్య, వేణు పాల్గొన్నారు.

రథసప్తమికి సుందరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి- అరసవల్లి



కాలనీల్లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జనవరి 25న జరగనున్న రథసప్తమి వేడుకలకు దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అరసవల్లి పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని, ముఖ్యంగా రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి అరసవల్లి అనుబంధ కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, భక్తుల రాకపోకలకు వీలుగా మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా కొయ్యాన కన్నయ్య కాలనీ, తెలుగు ముసలయ్య కాలనీ, కామేశ్వర్ నగర్ తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన కాలువల పనులు, దెబ్బతిన్న రహదారులను ఎమ్మెల్యే పరిశీలించారు. వెంటనే పూడికతీత పనులు చేపట్టి, రహదారులను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన అనుసంధాన రహదారుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం అరసవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మెరుగైన వసతులు కల్పించాలని, ఆస్పత్రి చుట్టూ రక్షణగోడ నిర్మించాలని సూచించారు. కామేశ్వర్ నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే సరిచేయాలని, ఉత్సవాల వేళ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇంజినీర్లు, హెల్త్ ఆఫీసర్, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌పై విచారణ

బూర్జ : మండలంలోని అన్నంపేట గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్‌పై ఎంపిడిఒ తిరుపతి రావు శనివారం విచారణ చేపట్టారు. అన్నంపేట గ్రామానికి చెందిన కుప్పిలి చంటి సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంపై విచారణ చేపట్టినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఫిర్యాదుదారుడు అంగన్వాడీకి సంబంధించిన వివరాలను అంగన్వాడీల ద్వారా గర్భినులకు, బాలింతలకు అంద జేస్తున్న పౌష్టికాహారంపై వివరాలు అడగడంతో తనకు తెలియదని మహిళా పోలీస్ చెప్పారని, దీనిపై చంటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ఎంపిడిఒ అంగన్వాడీలు బాలింతలకు, గర్భినులకు ఎంతవరకు పౌష్టికాహారాన్ని అందజేశారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు అడిగిన వివరాలను సకాలంలో అందజేయాలని ఎంపిడిఒ ఆదేశించిగా ఈనెల 30లోగా ఫిర్యాదుదారునికి వివరాలను అందజేస్తామని ఆమె వెల్లడించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ ఎం.భాస్కరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న ఎంపిడిఒ తిరుపతిరావు



నినాదాలు చేస్తున్న సాధన కమిటీ నాయకులు

పలాసను జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

పలాసను జిల్లాగా ప్రకటించాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. పలాసలో శనివారం జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం తరపున పలాస జిల్లా ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస జిల్లా ఏర్పాటైతే ఈ ప్రాంతంలో నివసిస్తున్న వికలాంగులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయన్నారు. న్యాయం, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని వివరించారు. పలాస జిల్లా సాధన ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు.

మాదకద్రవ్యాలతో జాగ్రత్త

ప్రజాశక్తి- కవిటి

మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.విష్ణుమూర్తి అన్నారు. 'మాదక ద్రవ్యాల వినియోగం - విద్యార్థుల అప్రమత్తత' అనే అంశంపై కళాశాలలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. రాబోయే సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి స్నేహితులు వస్తారని, కొందరు చెడు అలవాట్లకు లోనై ఉండవచ్చని, వారితో మసలేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, ఈగల్ క్లబ్ కన్వీనర్ బి.శ్రీనుబాబు, ఎల్.ఆనంద్ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కె.ఉగాదినాయుడు, డి.అనసూయ, కె.కరుణశ్రీ, డి.రమేష్, బి.అంజన, జనార్థనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అభ్యుదయ సైకిల్ యాత్ర సన్నాహక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు ఆధ్వర్యాన పట్టణ పురవీధుల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలుగు దుష్పలితాలను వివరిస్తూ ఈగల్ క్లబ్ అవగాహనా సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో మండల సమన్వయకర్త బోరుభద్ర సురేష్‌కుమార్, అధ్యాపకులు నల్లాన రమేష్, చింతాడ పాపారావు, హెన్నీ ప్రధాన్ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : బైక్ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి రూరల్ : పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టెక్కలిలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వైభవ వెంకటేశ్వర స్వామిని శనివారం సందర్శించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులు, భక్తుల సౌకర్యాలపై ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించారు. వైకుంఠ ఏకాదశి వేడుకలకు వేలాదిమంది యాత్రికులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం సులభంగా, ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ ఛైర్మన్ బాగాది శేషగిరిరావు, పట్టణ అధ్యక్షులు కోల లవకుమార్, దల్లి ప్రసాదరెడ్డి, గురువెల్లి బాలకృష్ణ, దవళ రామచంద్రరావు, కెల్లి శ్రీరాములు పాల్గొన్నారు.


ఫోన్ల బాక్సును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి

మెళియాపుట్టి: చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీలను బలోపేతం చేస్తోందని, దానిని గుర్తించి సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 42 మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే సంబంధిత కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వస్తువూ వారికి చేరవేయాలన్నారు. అనంతరం 5జి మొబైల్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, టిడిపి మండల అధ్యక్షుడు నంబాల వెంకటరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, ఎఎంసి ఛైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, బొచ్చు ప్రసాదరావు, రవ్వల గణపతిరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సిడిపిఒ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఐతమ్‌లో 'హాకథాన్' ప్రారంభం

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో సీజన్ 3 ఆవిష్కర్ 48 గంటల హాకథాన్ ప్రారంభించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.రజని పాల్గొని ప్రారంభించారు. అనంతరం మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టి.నాగరాజు పాల్గొన్నారు.


విసికి మెమోంటోను అందజేస్తున్న నాగేశ్వరరావు

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వం మహిళా సంఘాలలో ప్రతి కుటుంబానికీ సంక్షేమం, సంపదను సృష్టించే ఉద్దేశంతో కావాల్సిన రుణాలను ఇప్పించి వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిఆర్‌పి స్ట్రాటజీపై శనివారం అవగాహన కల్పించారు. విజన్ 47లో భాగంగా అన్ని కుటుంబాలకూ ఆరోగ్యవంతంగా, సంతోషంతో సంపదను సృష్టించే విజన్‌ను అర్థం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను ప్రతిఒక్కరూ సాధించుకొని మెరుగైన ఫలితాల కోసం సమర్థవంతంగా పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో మన సంఘ సభ్యుల ఆలోచన విధానం మారాలన్నారు. అప్పులను సమానంగా పంచుకునే పద్ధతికి స్వస్తి చెప్పి మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం ఏ కార్యక్రమానికి ఎవరికీ ఎప్పుడు ఎంత డబ్బులు కావాలో ఆ విధంగా రుణాలను పొందాలని సూచించారు. ముందుగా సంఘ సభ్యులందరూ తమ సొంత నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, లీగల్ కో-ఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు స్వామినాయుడు, దుర్గారావు, రమేష్, బాలకృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలాకి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్వహిస్తున్న ఆన్ ద జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను (ఒజేటి) జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి రేగ సురేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఒజేటి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు సూచించారు. శ్రీకాకుళం శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి శిక్షణను జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో విద్యార్థులకు ఒజేటి మేలు చేస్తుందని, భవిష్యత్‌లో ఉద్యోగంలో చేరినప్పుడు ఉపయుక్తంగా ఉంటుందని ప్రిన్సిపాల్ హెచ్.పద్మలత అవగాహన కల్పించారు. నెలరోజుల ఒజేటిలో భాగంగా క్షేత్రస్థాయి శిక్షణకు తీసుకొచ్చినట్లు అధ్యాపకులు బి.ఎల్.వి. నరసింహారావు, కాయ రవీంద్ర తెలిపారు.



శిక్షణను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

సిఆర్‌పిలకు శిక్షణ


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వెలుగు కార్యాలయంలో కొత్తగా ఎంపికైన ఈ నారీ, సిఆర్‌పిలకు ఎపిఎం గొడబ ప్రసాదరావు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నారీలకు కేటాయించిన పది సంఘాలకు చెందిన సభ్యులు ఫోన్ నంబర్లు సేకరించి సంఘ పుస్తకంలో రాయాలన్నారు. సంఘ సభ్యుల వారీగా మెంబరు ఐడిలు పుస్తకాలలో రాయాలని సూచించారు. ప్రతి ఈ నారీ మన డబ్బులు మన లెక్కలు యాప్ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలన్నారు. అలాగే అందరి సభ్యులతోనూ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి, కోశాధికారి చంద్రకళ, సిసి సనపల రేణుక, అకౌంటెంట్ మీనా, అక్కుపల్లి క్లస్టర్, కొత్తూరు పోలమ్మ పాల్గొన్నారు.

రామాయణ ఇతివృత్తాంతంపై పరీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ, మండలంలోని విద్యా వికాస్ సేవా సమితి రామాయణం ఇతిరుంతాంతంపై శనివారం పరీక్ష నిర్వహించారు. డొంకూరు హైస్కూల్ 25, బూర్జిపాడు హైస్కూల్ పది, ఈదుపురం హైస్కూల్ పది, మండపల్లి హైస్కూల్ ఐదు లొద్దిపుట్టి హైస్కూల్ పది, తోటూరు సత్యసాయి స్కూల్ 95, మండపల్లి శారద స్కూల్ 25, పురుషోత్తపురం మోడల్ స్కూల్ 85, బాయ్స్ హైస్కూల్ 45, ఇచ్ఛాపురం బాలికల హైస్కూల్ 20, బెల్లుపడ కస్తూరిబాయ్ స్కూల్ 30, రత్తకన్న హై స్కూల్ 25, రత్తకన్న వినాయక స్కూల్ 40, స్వర్ణభారతి విద్యాసంస్థలు 70, జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 55, రవీంద్ర భారతి స్కూల్ 19, శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 42, హెబ్రాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 55 మంది పాల్గొన్నారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సర్పంచ్ దయమంతి

తొలుసూరుపల్లి పంచాయతీ విభజన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో తొలుసూరుపల్లి పంచాయతీ విభజనకు సర్పంచ్ బగాది దమయంతి అధ్యక్షతన శనివారం ప్రజాభిప్రాయ సేకరణలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే తొలుసూరుపల్లి పంచాయతీలో సైనికనగర్, జయకృష్ణపురం ధర్మనీలపురం, మున్న బీపేట ఉన్నాయి. తొలుసూరుపల్లి సైనిక నగర్ ఒక పంచాయతీ, జయకృష్ణపురం, ధర్మనీలపురం, మున్నబీపేట ఒక పంచాయతీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. కార్యక్రమంలో చింతాడ లత, ఎంపిటిసి మాజీ సభ్యులు నూక కనకరావు, కార్యదర్శి ఎస్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కురుడు పంచాయతీ చౌదరికొత్తూరుకు దంతరోడ్డులోని కొత్తూరు కూడలి నుంచి గ్రామం వరకు సుమారు 500 మీటర్లుల రోడ్డు పొడవున విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కూటి నుంచి గ్రామం వరకు ఇరువైపుల దట్టమైన పొదలు, చెట్లు ఉండటం వల్ల రాత్రి భాగంలో గ్రామానికి వచ్చేటప్పుడు విషసర్పాలు, జంతువుల భయం ఎక్కువగా ఉందని అన్నారు. మరీ ముఖ్యంగా మహిళలు గ్రామానికి చేరడం కష్టతరమవుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు సౌకర్యం కల్పిస్తారని కోరుతున్నారు.

సిపిఐ ఉత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ కోరారు. నరసన్నపేటలో సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు నెయ్యల నారాయణరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ ఏర్పాటై వందేళ్లు అవుతుందని అన్నారు. ఈ వందేళ్లలో సిపిఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాటాన్ని సాగించిందని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతూ ప్రజలతో మమేకమైందని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అరవింద్, నెయ్యల మధు, లవకుమార్, భాస్కరరావు, మన్మథ, కర్ల, వీరుడు, వసంత్, రాము, లక్ష్మి, అచ్చమ్మ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- రణస్థలం

పేదలకు సిఎం సహాయనిధి ఒక వరమని, పేద కుటుంబాలు వైద్యం కోసం దరఖాస్తు చేసిన వెంటనే సిఎం నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకుల సమక్షంలో సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. 14 మందికి రూ.10,45,209 లక్షల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే ముందస్తు చికిత్సల నిమిత్తం రూ.17,90,000 మంజూరు చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.